ఎమ్మెల్యే సునీత ఇంటిపై కాంగ్రెస్ దాడి

- వినాయక నిమజ్జనం ముసుగులో అరాచకం
- సునీత ఇంటి లోపలికి వెళ్లి మరీ వీరంగం
- ప్రశ్నించిన యువకుడు మణిదీప్‌పైనా దాడి
- రాళ్లు, ఇటుకలతో ఇంటిపై విధ్వంసం
- ప్రణాళిక ప్రకారమే నా ఇంటిపై దాడి: సునీత
- నలుగురిపై కేసు నమోదు చేశాం: ఎస్సై

మెదక్ జిల్లా గోమారంలోని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నివాసంపై ఇటుకరాళ్లతో దాడి చేసిన దృశ్యం

గాయపడిన యువకుడిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్/శివ్వంపేట, సెప్టెంబర్ 23: బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ దాడులు కొనసాగుతున్నాయి. మొన్న సిద్దిపేటలో హరీశ్‌రావు కార్యాలయంపై, నిన్న హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై, నేడు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం గోమారంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి తెగబడ్డాయి. గ్రామానికి చెందిన కొందరు కాంగ్రెస్ కార్యకర్తలు ఆదివారం అర్ధరాత్రి వినాయక నిమజ్జనం ముసుగులో సునీత ఇంటి ముందు పటాకులు కాల్చి నానా హంగామా చేశారు. ఆమె ఇంట్లోకి వెళ్లి టపాకులు కాల్చే ప్రయత్నం చేయగా అడ్డుకుని ప్రశ్నించిన యువకుడు మణిదీప్‌పై దాడికి దిగారు. అంతటితో ఆగకుండా ఇటుకలు, కట్టెలతో ఇంటిపై దాడిచేశారు. విషయం తెలిసి అక్కడికి వచ్చిన స్థానిక బీఆర్ఎస్ నేతలను కూడా అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించిన పోలీసులను సైతం కాంగ్రెస్ నాయకులు తోసివేశారు. శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలను చెదరగొట్టారు.

ఇది ప్రజాస్వామ్యమేనా?: సునీత

తన ఇంటిపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తన ఇంటిపై దాడితో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని మండిపడ్డారు. ప్రణాళిక ప్రకారమే తన ఇంటిపై దాడి జరిగిందని ఆరోపించారు. ఇంట్లో నిద్రపోతున్న పిల్లలపైనా దాడిచేశారని ఆరోపించారు. దాడులు ఎందుకు చేశారు? వాటి వెనక ఉన్నదెవరు? కారణమేంటి? అని ప్రశ్నించారు. దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, దాడికి పాల్పడిన వారిపైన, వారిని ప్రోత్సహించిన వారిపైనా హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ తమకు సంస్కారం నేర్పబట్టే సైలెంట్‌గా ఉంటున్నామని పేర్కొన్నారు. పోలీసుల నిర్లక్ష్యంగా కారణంగానే దాడులు జరిగాయని ఆరోపించారు. హెడ్‌కానిస్టేబుల్‌పై జరిగిన దాడిని ప్రస్తావిస్తూ రాష్ట్రంలో పోలీసులకు కూడా రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న నియోజవకర్గ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చి ఎమ్మెల్యేను పరామర్శించారు.

అకారణంగా నాపై దాడి

'ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంట్లో ఉంటున్న నాపై కొందరు కాంగ్రెస్ నాయకులు అకారణంగా దాడి చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ఆదివారం రాత్రి ఒంటిగంట ప్రాంతంలో కొందరు కాంగ్రెస్ నాయకులు పటాకులు ఎమ్మెల్యే ఇంటి గేటు లోపలికి వచ్చి కాల్చే ప్రయత్నం చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే గుంటాల నర్సింహారెడ్డి, పెద్దపట్లోరి భాస్కర్‌రెడ్డి, నాగులూరి సుధాకర్‌రెడ్డి, సర్జన రమేశ్ అన్యాయంగా దాడి చేశారు' అని మణిదీప్ గౌడ్ వివరించాడు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడికి పాల్పడిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు శివ్వంపేట ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే ఇంట్లో ఉన్న మణిదీప్‌గౌడ్‌పై అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు దాడి చేసినట్టు చెప్పారు. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు

మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయటం అత్యంత హేయమైన చర్య. దాడికి పాల్పడిన కాంగ్రెస్ గుండాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్ పార్టీ దాడులతో సునీతా లక్ష్మారెడ్డి వంటి బలమైన నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు.

- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తక్షణమే అరెస్టు చేయాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ పార్టీ గూండాలను వెంటనే అరెస్టు చేయాలి. దాడులతో బీఆర్ఎస్ పార్టీని, మహిళా ప్రజాప్రతినిధులను భయపెట్టివ్వాలనుకోవడం కాంగ్రెస్ పార్టీ మూర్ఖత్వమే.

- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రాష్ట్రంలో రాక్షసపాలన

ఇందిరమ్మ పాలన తెస్తామ ని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగిస్తున్నది. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గూండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్న. రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణను బీహార్ మాదిరిగా మార్చేస్తున్నారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి.

- మాజీ ఎమ్మెల్యే పొడితెల సతీశ్‌కుమార్

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, సమావేశంలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు తదితరులు

'కాళేశ్వరం'పై కాంగ్రెస్‌కు అవగాహన లేదు

ఆరు కొత్త ప్రాజెక్టులు కట్టించిన చరిత్ర కేసీఆర్‌ది : మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వెల్లడి

జమ్మికుంట, సెప్టెంబర్ 23: 'కాళేశ్వరం ప్రాజెక్టు దేశానికే దిక్సూచి. ఆలాంటి ప్రాజెక్టుపై కనీసం అవగాహన లేకుండా సీఎం, మంత్రులు మాట్లాడుతున్నరు. లక్ష కోట్లు వృథా చేశారని, పైసలన్నీ గోదావరిలో పోశారని ఆరోపిస్తున్నరు. ప్రకృతి విపత్తుతో మేడిగడ్డకు చెందిన పిల్లర్ కుంగింది. దీనిని రాద్ధాంతం చేస్తున్నరు. ప్రాజెక్టు కొట్టుకుపోవాలని దుర్మార్గంగా ఆలోచిస్తున్నరు. కాళేశ్వరమంటే ఒక్క మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలే కాదు.. ఈ మూడు బ్యారేజీలకు పెట్టిన ఖర్చు కేవలం రూ.9,500 కోట్ల లోపే. వందల కిలోమీటర్ల సొరంగాలు, కాలువలు, ఎత్తిపోతలు, లిఫ్టులు, విద్యుత్తు సబ్‌స్టేషన్లు.. ఇలా ఎన్నో నిర్మాణాలకు రూ.90 వేల కోట్లు ఖర్చు చేసినం. తెలంగాణ రైతాంగానికి భవిష్యత్తు అందించినం. రాబోయే రోజుల్లో సోలార్ ప్యానళ్లతో కాళేశ్వరం సాగుతుంది. ఇదీ కేసీఆర్ విజన్. కాళేశ్వరం గురించి తెలియాల్సిన ప్రాథమిక సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తాం' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్ స్పష్టంచేశారు. సోమవారం ఆయన కరీంగనర్ జిల్లా జమ్మికుంట మండల కేంద్రానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి వచ్చారు. మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు నివాసంలో వినోద్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ సాధించుకున్న తర్వాత ఆరు ప్రాజెక్టులను కట్టించిన చరిత్ర బీఆర్ఎస్‌దేనని పేర్కొన్నారు. ఎల్లంపల్లి, ప్రాణహిత, చేవేళ్ల, టీడీపీ విడిచిపెట్టిన దేవాదుల, ఇంద్రావతి, సీతమ్మసాగర్, మల్లన్నసాగర్, అనంతసాగర్, రంగనాయకసాగర్ తదితర పాత ప్రాజెక్టులకు రీడిజైన్లతోపాటు కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. పిల్లర్ కుంగితే రాద్ధాంతం చేయడం తగదని సూచించారు.

కోర్టుల్లో 5.84 కోట్ల కేసులు పెండింగ్

తమిళనాడు మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు ఆవేదన

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): దేశ న్యాయవ్యవస్థ దారుణమైన స్థితిలో ఉన్నదని, ఈ ఏడాది ఆగస్టు చివరినాటికి వివిధ కోర్టుల్లో 5.84 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తమిళనాడు మాజీ గవర్నర్, ఏపీ మాజీ డీజీపీ పీఎస్ రామ్మోహన్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (అస్కీ)లో సోమవారం జరిగిన ప్రొఫెసర్ ఎస్ వేణుగోపాలరావు 5వ స్మారకోపన్యాస కార్యక్రమంలో రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. కొత్త చట్టాల్లో పేర్ల మార్పులే తప్ప గణనీయమైన మార్పులేమీ లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో అస్కీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్ రమేశ్ కుమార్, గుడ్‌గవర్నెన్స్ చైర్మన్ కే పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఏపీని చూసి మేల్కోవాలి

- ప్రభుత్వం మారాక అక్కడ పోలీసు అధికారుల గతి ఏమైందో చూస్తున్నారుగా
- చట్టాన్ని అతిక్రమిస్తే జరిగేది ఇదే
- పోలీసులను హెచ్చరించిన హరీశ్‌రావు
- రాష్ట్రంలో బీహార్, రాయలసీమ పరిస్థితులు
- ఎమ్మెల్యే సునీత ఇంటిపై దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి
- గోమారంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు

మెదక్ జిల్లా గోమారంలో విలేకరులతో మట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తదితరులు

మెదక్/నర్సాపూర్/శివ్వంపేట, సెప్టెంబర్ 23: పోలీసు తాము శాశ్వతమని అనుకోవద్దని, పొరుగు రాష్ట్రం ఏపీని చూసైనా నేర్చుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు హితవు పలికారు. చట్టాన్ని ఉల్లంఘించిన ఆంధ్రప్రదేశ్‌లోని అడిషనల్ ఐజీలు, డీజీలు సస్పెండయ్యారని గుర్తుచేశారు. అలాంటి పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు. రాష్ట్రంలో గూండా రాజ్యాన్ని తలపించేలా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని, తెలంగాణకున్న మంచి పేరును మంటగలిపి తెలంగాణను బీహార్‌లా మారుస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై జరిగిన దాడి కాంగ్రెస్ నాయకత్వ ప్రోత్సాహంతోనే జరిగిందని ఆరోపించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపై దాడి జరిగినట్టు తెలుసుకున్న హరీశ్‌రావు శివ్వంపేట మండలం గోమారం గ్రామానికి చేరుకొని సునీతను పరామర్శించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమెతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో గుండాల రాజ్యం నడుస్తున్నదని ఆరోపించారు. సిద్దిపేటలో తన క్యాంపు కార్యాలయంపై, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఇంటిపై, ఇప్పుడు గోమారంలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఇంటిపైన కాంగ్రెస్ నాయకులు దాడులకు తెగబడ్డారని మండిపడ్డారు. తెలంగాణకు ఉన్న మంచి పేరును నాశనం చేసి బీహార్, రాయలసీమ తరహాలో మారుస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి మాటలు, ఆయన రెచ్చగొట్టే విధానంతోనే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇంట్లో పటాకులు పేల్చి, పిల్లలపై దాడి చేయడం అమానుషమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎస్పీ, ఐజీతో మాట్లాడి కాంగ్రెస్ గుండాలను వెంటనే అరెస్టు చేయాలని కోరినట్టు తెలిపారు. ఫొటోలు, వీడియోలు తీస్తున్న హెడ్‌కానిస్టేబుల్‌పై దాడిచేయడం ఏమిటని ప్రశ్నించారు. హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి జరిగినప్పుడు సుమోటోగా తీసుకొని ఆయన ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయొచ్చుకదా.. ఎందుకు చేయడం లేదని పోలీస్ ఉన్నతాధికారులను ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క ఎమ్మెల్యేపై కూడా ఇలాంటి దాడి జరగలేదని గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలతో తమది పేగుబంధమని, ఎక్కడా ఎలాంటి హింసాత్మక ఘటనలు జరగకుండా తాము చాలా జాగ్రత్తగా వ్యవహరించినట్టు తెలిపారు. ప్రభుత్వం, పోలీసులు కూడా అలానే వ్యవహరిస్తే మంచిదని హితవు పలికారు. ఇంట్లోకి చొరబడి దాడిచేసిన వారిని అరెస్టు చేసి రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ సక్రమంగా ఉందని నిరూపించుకోవాలని సూచించారు. ఘటనపై పిటిషన్ ఇచ్చినప్పటికీ ఎఫ్ఐఆర్ నమోదు చేయడం లేదని, తక్షణమే గోమారంలో కాంగ్రెస్ గుండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఎమ్మెల్యే అని చూడకుండా అర్ధరాత్రి దాడులు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీనిని వదిలిపెట్టే సమస్యే లేదని, అవసరమైతే జాతీయ మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని, కోర్టుకు వెళ్లేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.

ఉన్నతస్థాయి విచారణ జరిపించాలి

గోమారం ఘటనపై ఉన్నతస్థాయి విచారణ జరిపించి, దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసులు పెట్టి తక్షణమే అరెస్టు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరం కలసి డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, మఠం భిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అటాక్.. పోలీస్ సైలెంట్!

- పచ్చని తెలంగాణలో అధికారపక్షం చిచ్చు
- కాంగ్రెస్ ఆగడాలపై అరెస్టులేవి?
- ఫ్యాక్షన్ సంస్కృతికి కాంగ్రెస్ ఆజ్యం
- ఎమ్మెల్యేల ఇంటిపై దాడి చేస్తే చర్యల్లేవా
- ఒక్కరిపైనా చర్యలు తీసుకోని పోలీసులు
- డీజీపీ, ఐజీలకు విన్నవించినా అరెస్టుల్లేవ్

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో అధికారపక్షం చిచ్చు రాజేస్తున్నది. రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాల్సిన ప్రభుత్వమే.. తమ కాంగ్రెస్ శ్రేణులను బీఆర్ఎస్ నేతలపై దాడులకు ఉసిగొల్పుతున్నది. రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసేందుకు కుయుత్తులు పన్నుతున్నది. ప్రతిపక్షం ప్రశాంతంగా తమ పని తాము చేసుకుపోతుంటే అధికారపక్షం మాత్రం రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి కవ్వింపు చర్యలు చేపడుతున్నది. పోలీసులు సైతం అధికార పక్షానికి వత్తాసు పలుకుతున్నారన్న విమర్శలున్నాయి.

పోలీసుల పక్షపాత వైఖరి

రాష్ట్రంలో శాంతిభద్రతల విఘాతానికి పోలీసుల పక్షపాత వైఖరే కారణమని విశ్లేషకులు చెప్తున్నారు. పది నెలలుగా అధికార పక్షంపై రాష్ట్రంలో ఎక్కడో ఓ చోట దాడులు జరుగుతున్నా పోలీసులు మెతక వైఖరి ప్రదర్శిస్తున్నారు. సాక్షాత్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లపైనే కాంగ్రెస్ కార్యకర్తలు రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడితే వారిని అరెస్టు చేయకపోవడం పోలీసుల పక్షపాతవైఖరిని స్పష్టం చేస్తున్నది. ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేయగా, ఆ తర్వాత పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి వెళ్లి నానా హంగామా సృష్టించారు. తాజాగా మెదక్ జిల్లాలోని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంట్లో అదివారం అర్ధరాత్రి కాంగ్రెస్ శ్రేణులు చేసిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ఇంటి బయట, నట్టింట్లో పటాకులు కాల్చారు. నిద్రపోతున్న పనివారిపై భౌతిక దాడులకు తెగబడి, తీవ్రంగా గాయపర్చారు. ఈ దాడిని వీడియో తీస్తున్న ఓ కానిస్టేబుల్‌పైనా భౌతికదాడికి పాల్పడి పాల్పడ్డారు. అయినా, వారిపై ఎలాంటి చర్యలు లేవు. అరెస్టులు అసలే లేవు.

కేసులు, అరెస్టుల ఊసే లేదు

బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలపై దాడులు చేసినా, వారి ఆస్తులు ధ్వంసం చేసినా కేసులు కానీ, అరెస్టులు కానీ ఉండటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల కాలంలో ఈ తరహా దాడులు నిత్యం ఎక్కడో ఒక చోట జరుగుతూనే ఉన్నా ఒక్కర్ని కూడా అరెస్ట్ చేయకపోవడం గమనార్హం. కొందరిపై కేసులు పెట్టి పోలీసులు చేతులు దులిపేసుకుంటున్నారు. ఖమ్మంలో పేదలకు సాయం చేసేందుకు బీఆర్ఎస్ అగ్రనేతలు వెళ్తే అక్కసుతో దాడికి పాల్పడినా అరెస్టులు లేవు. మాజీ మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేసినా అరెస్టులు లేవు. నల్లగొండలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే కిశోర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి తెగబడినా అరెస్టులు లేవు. పాడి కౌశిక్‌రెడ్డి అంశంలో ఎమ్మెల్యే గాంధీ, అతని అనుచరులపై హత్యాయత్నం కేసులు నమోదు చేసినా అరెస్టు లేదు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఇంటిపై దాడికి చేస్తే అరెస్టులు లేవు. ఈ వరుస సంఘటనలపై బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇటీవల డీజీపీని కలిసి వినతిపత్రం సైతం అందించారు. నర్సాపూర్ దాడిపై మాజీ మంత్రి హరీశ్‌రావు డీజీపీ జితేందర్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీలతో మాట్లాడినా చర్యలు శూన్యం.

నన్ను చంపేందుకు కొమ్మూరి కుట్ర!

- సుపారి గ్యాంగ్‌తో రూ.25 లక్షలకు డీల్
- కాంగ్రెస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కంచె రాములు ఆరోపణ
- వెస్ట్ జోన్ డీసీపీకి ఆధారాల సమర్పణ
- ఫ్యాక్షన్ తరహా రాజకీయాలపై ఆందోళన
- రక్షణ కల్పించాలంటున్న సొంతపార్టీ నాయకులు

జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు లిఖిత పూర్వక ఫిర్యాదు చేస్తున్న అసమ్మతి వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు

జనగామ, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): జనగామ కాంగ్రెస్‌లో వర్గపోరు, గ్రూపుల కుమ్ములాటలు ఫ్యాక్షన్ తరహా రాజకీయాలకు తెరలేపుతున్నాయి. డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తనను హతమార్చేందుకు కుట్ర పన్నుతున్నాడని సొంత పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఇసుక లారీతో గుద్దించి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించేందుకు రూ.25 లక్షలకు సుపారి గ్యాంగ్‌తో డీల్ కుదుర్చుకున్నాడని ఆరోపిస్తూ అందుకు సంబంధించిన వీడియో ఆధారాలను సమర్పించారు. ఈ ఘటన జిల్లా కాంగ్రెస్‌లో పెను సంచలనం రేపింది. కొమ్మూరి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న సీనియర్ నాయకులు మున్సిపల్ మాజీ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మున్సిపల్, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దూడల సిద్ధయ్య, సర్వల నర్సింగరావు, మున్సిపల్ కౌన్సిలర్లు గంగరబోయిన మల్లేశం, ముత్యాల చందర్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, జాయ మల్లేశం, గాదెపాక మహేందర్, సుంకరి శ్రీనివాస్‌రెడ్డి, చింతకింది మల్లేశం, పులిగిల్ల శివ తదితర సీనియర్లు డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి నుంచి తమకు రక్షణ కల్పించాలంటూ డీసీపీకి ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీలో తాను 30 ఏండ్లుగా వివిధ హోదాల్లో సేవలందించానని, గతంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశానని రాములు పేర్కొన్నారు. కొంతకాలంగా సీనియర్లకు దక్కాల్సిన పదవులను జిల్లా పార్టీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి అమ్ముకున్నాడని పార్టీ అధిష్ఠానికి ఫిర్యాదు చేశామని, దీనిని దృష్టిలో ఉంచుకొని కొమ్మూరి తమపై కక్షసాధింపులకు పాల్పడున్నాడని, అందులో భాగంగా కొద్దినెలల క్రితం మాజీ మున్సిపల్ చైర్మన్ వై సుధాకర్ కారును పెట్రోల్ పోసి దగ్ధం చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాజాగా తన అనుచరుడైన రావుల శ్రీనివాస్‌రెడ్డిని కొమ్మూరి పిలిపించుకొని రూ.25 లక్షల సుపారీ ఇచ్చి తనను ఇసుక లారీతో ఢీకొట్టించి హతమార్చేందుకు కుట్రపన్నాడని ఆరోపించారు. ఇదే విషయాన్ని సీనియర్ నాయకుల ముందు శ్రీనివాస్‌రెడ్డి చెప్పిన వీడియో రికార్డును కంచె రాములు డీసీపీకి అందజేశారు. జనగామలో ఫ్యాక్షన్ రాజకీయాలతో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా ప్రయత్నిస్తున్న ప్రతాప్‌రెడ్డిపై చర్యలు తీసుకొని తన తోపాటు సీనియర్ నాయకులకు రక్షణ కల్పించాలని ఆ ఫిర్యాదులో కోరారు.

లోకం పోకడ

డస్టర్లు లేకుంటే మాత్రం మా బట్టలిప్పి తుడుస్తారేం సార్?

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.8°c	23.6°c
మెదక్	35.0°c	22.1°c
వరంగల్	34.0°c	25.0°c
నిజామాబాద్	33.4°c	24.4°c
రంగారెడ్డి	33.0°c	21.0°c
హైదరాబాద్	32.4°c	22.3°c
కరీంనగర్	32.0°c	26.0°c
ఖమ్మం	31.0°c	25.0°c
నల్లగొండ	30.0°c	23.0°c
మహబూబ్‌నగర్	29.1°c	23.2°c

3 రోజులపాటు భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : తిరోగమన రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాగల మూడురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాగల 24 గంటల్లో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండడంతో మంగళవారం నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ-గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. బుధవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలుపడుతాయని వివరించింది. ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్‌ను జారీ చేసింది.

గడిచిన 24 గంటల్లో..

సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 16.28 సెంమీకు గాను సోమవారం నాటికి 25.96 సెంమీ నమోదైంది. ఇది నిరుటితో పోలిస్తే 95 అధికం. గడిచిన 24 గంటల్లో హైదరాబాద్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, వనపర్తి జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసినట్టు వాతావరణ కేంద్రం తెలిపింది.

జీతాలు పెండింగ్‌లో లేవు

వైద్యారోగ్య శాఖ వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 23 (నమస్తే తెలంగాణ): సాధారణ బదిలీల్లో భాగంగా ఇటీవల ఇతర జిల్లాల్లోకి వెళ్లిన సిబ్బందికి జీతాలు, అలవెన్స్‌లు పెండింగ్‌లో లేవని రాష్ట్ర ప్రభుత్